# లవ్ లెటర్

తల్లి చెప్పే పాఠాల్ని అర్థంచేసుకుంటే జీవితంలో ఎదురుదెబ్బలు తగలవు.

- జయప్రద

"ప్రియమైన దీప్తికి...

అమ్మ దీవించి వ్రాయునది-

నీ పెళ్ళి హడావుడి తాలూకు అలసట ఇప్పటికి తీరిందిరా! నిన్ను చాలా మిస్ అవుతున్నాను దీప్తీ... నీ చిన్ననాటి అల్లరి, ఆటలు, టీనేజ్‌లో నీ అభిమానాలు, అలకలు... ఎన్ననీ? వదిలెయ్! కానీ, నీకు పెళ్ళిచేసి పంపాననే ఆనందం మధ్యగా అంతర్లీనంగా ఏదో బాధాతప్త సందడి! దాని సమగ్ర స్వరూపాన్ని తెలుసుకోవడానికి నాకు ఇన్ని రోజులు పట్టింది.

ఈ ఉత్తరాన్ని ఇంతవరకు చదవగానే నీ ఊహకు ప్రాణం వచ్చుంటుంది. 'అమ్మ నా ఎడబాటుకు బాధపడ్తోంది' అని అనుకుంటూ వుంటావు నువ్వు. కదూ... దీప్తీ! అందుకే నీ ఊహను 'ఊహ' అనే అన్నాను.

చిన్నీ! నీ పెళ్ళి టెన్షన్‌లో, నువ్వు దూరమవుతున్నావనే దిగులులో... నీకు ముఖ్యంగా చెప్పాల్సిన కొన్ని విషయాలు నీకు చెప్పలేకపోయానురా! అది చెప్పడానికే ఈ లెటర్. ఫోన్‌లో ఇంత స్పష్టంగా చెప్పలేను కదా!

నేను నీకు నీతిబోధ చేస్తున్నాను అని అనుకోవద్దు. నా ఆరాటమంతా... నా దీప్తి అత్తగారింట్లోనే కాదు- జీవితంలోనే తృప్తిగా బతకాలని... అదే నా ఆశ! నువ్వు పసిపిల్లవు... నిన్ను అర్థంచేసుకునే అమ్మ, నాన్న, స్నేహితులు తప్ప మరో ప్రపంచం తెలియనిదానివి నువ్వు. లోకాన్ని, అందులోని మనుషుల్ని ఔపోసన పట్టిన అనుభవం నాది. నా అనుభవాల నుండి నువ్వు పాఠాలు నేర్చుకోవాలనేదే నా కోరిక. ఎందుకంటే... అందరూ జీవితాల్ని అమాయకంగా, మూర్ఖంగా ఖర్చుచేసుకుని, తమ పరాజిత బతుకుల్లో నుండి పాఠాలు

నేర్చుకుంటున్నారు. అందువల్ల వాళ్ళ జీవితాలు తిరిగి చిగురించవు. జీవితాల్ని చిరగకుండానే చూసుకోవాలి. అందుకే ఈ ఉత్తరం నీకు.

దీప్తీ! నువ్వు నా కడుపులో పెరిగావు. నా ఒళ్ళో ఉదయించావు. నా చేతుల్లో ఎదిగావు. నీ మనస్తత్వమేమిటో నాకు తెలుసు. నీ మనసేవిటో, నీ మాట తీరేమిటో, నీ గుండెల్లో నాపట్ల నీ ప్రేమెంతో... అన్నీ నాకు తెలుసు. అందుకే దీప్తీ! నీ విసుగులో నువ్వు ఎప్పుడైనా నాతో విసురుగా మాట్లాడినా వూర్కున్నాను. అనవసరంగా కోప్పడినా సర్దుకున్నాను. నువ్వు మా శక్తికి మించినవి కోరినా... గాడిద బరువు మోసే మీ నాన్నకు చెప్పి కొన్ని తీర్చాను. కొన్ని తీర్చలేక నీకు నచ్చచెప్పబోయి నీ నిరాశకు, నీ కన్నీళ్ళకు కారణమయ్యాను. నీ కన్నీళ్లు చూసి నా మనసును నలుపుకున్నాను.

కానీ, చిన్నీ! మీ అత్తగారింట్లో నీ పరిస్థితి వేరు. నువ్వేమిటో వాళ్ళకు తెలీదు. వాళ్ళు ఎలాంటివాళ్ళో నీకూ తెలీదు. అందుకే నేను నీకు చెప్పాలనుకున్నది నీకు పెళ్ళికి ముందే చెప్పకపోవడం... నేను పొరపాటే చేశాను. అయినా ఇప్పుడు మాత్రం మించిపోయిం దేమీ లేదు.

దీప్తీ! నిన్ను మీ వారితో, మీ అత్తమామలతో పూర్తిగా అనుసరించి పొమ్మనడం లేదు నేను. కానీ, ఆలోచించమ్మా! వాళ్ళని నువ్వు నొప్పించకుండా వుంటే వాళ్ళు నీ వాళ్ళవుతారు. అప్పుడు వాళ్ళు నిన్ను నొప్పించరు. నిజంరా! పోనీ, మంచిగా వుండడానికి చిన్న చిట్కా చెప్పనా నీకు?

మనం ఏ మాట మాట్లాడినా, ఏ పని చేసినా- ఎదుటి వ్యక్తులు బాధ పడ్తారేమోనని ఒక్క క్షణం... నేనిలా చేస్తే ఎదుటి మనుషులు నన్నేమనుకుంటారో... అని మరో క్షణం ఆలోచిస్తే- ఆలోచించి ఆచరిస్తే... అది చాలు- మనకంటె మంచివాళ్ళు మరొకరు వుండరు. అలా ఆలోచించి ప్రతి అడుగు వేయాలంటే- నేనూ ఒప్పుకుంటాను... మనం కొన్నింటిని కొద్దిగా వదులుకోవాలి. 'నాది' అనే సుఖాన్ని, 'నాకు' అనే స్వార్థాన్ని, 'నేను' అనే అహంకారాన్ని, 'నా మాటే నెగ్గాలి' అనే ఆధిక్యతా భావాన్ని... ఇలాగే మరికొన్నిటిని వదులుకోవాలి.

ఇంకా కొన్నిటికి దూరంగా వుండాలి... అత్యాశకు, ఓర్వలేనితనానికి, కక్షలకు, కార్పణ్యాలకు!

కష్టమేరా! కానీ... 'దీప్తి మంచిది' అని అన్పించుకోవడంలో నీకు లభ్యమయ్యే కొండంత తృప్తి కోసం, కట్టె కాలినా గుర్తుండిపోయే కీర్తి కోసం- మనల్ని పతనంలోకి నెట్టే ఆ కొన్నింటిని వదులుకోలేవా? మనం జనన మరణాల జీవనసత్యాన్ని తెలుసుకుంటే అదేమంత అసాధ్యం కాదురా! కాకపోతే మనలో రాక్షసత్వం కూడా దాగుంది. దాన్ని జయించామంటే మన జన్మ సార్థకమయినట్టే! ఏమంటావు దీప్తీ!

చిన్నీ... బాధపడ్తున్నావా? 'అమ్మ నన్ను అంత చెడ్డగా ఊహించుకొంటోందా?' అని చిన్నబుచ్చుకుంటున్నావా? లేదురా... నువ్వేమిటో నాకు తెలుసు. కాకపోతే, 'నువ్వింకా నా పొట్ట మీద ఆడుకునే పసిపాపవు!' అనే భావం నన్ను వదలక కొంత, నేను ముందుగా

చెప్పినట్టు- నా జీవితంలో నుండి నువ్వు పాఠాలు నేర్చుకోవాలనే గాఢమైన ఆశతో కొంత... నా చేత నీకు ఈ ఉత్తరాన్ని వ్రాయిస్తోంది.

దీప్తీ... నీకు మా నాన్నమ్మ గుర్తుంది కదూ! ఆమె చాలా మంచిది. కానీ, ఆమెలో 'నేను అత్తను... కాబట్టి కోడలు నా మాట వినాలి!' అనే మనస్తత్వం వుండేది. అది తప్ప మిగతా అన్ని విషయాల్లో తన కూతుర్లతో సమంగా చూసేది నన్ను. ఆ సంగతి నా చిన్నవయసుకు అర్థంకాలేదు. దాని ఫలితం... మా ఇద్దరి మధ్య స్పర్థలు! ఆ తర్వాత కొన్నేళ్లకు ఒకర్ని ఒకరం అర్థంచేసుకుని, ఒకరిని వదిలి మరొకరం వుండలేని దశకు వచ్చాం. కానీ, ఏం లాభం? మా ఇద్దరి మధ్య నలిగిపోయారు మీ నాన్నగారు. దాని ఫలితం... తొలిరోజుల దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని నేను పోగొట్టుకున్నాను. మారిన కోడలి ఆదరణను తీరా అనుభవించక ముందే ఆమెకు పైనుండి పిలుపొచ్చింది.

నేను ఇప్పుడు నీకు చెప్తున్నట్టు- మీ అమ్మమ్మ నన్ను అత్తగారింటికి పంపేప్పుడు 'మీ అత్తని అనుసరించి నడుచుకో!' అని కాకుండా- ఆమె అనుభవాల్ని నా ముందు పరుచుంటే... జీవన మాధుర్యాన్ని ఎలా చవిచూడచ్చో వివరించివుంటే... నువ్వు చెప్పు- నేను నా తొలిజీవితాన్ని, ఆమె మలిజీవితాన్ని నష్టపోయేవాళ్ళమా? అందుకే నీకు కొన్ని చిన్న విషయాలు చెప్పాలనివుంది. వాటిని నువ్వు తేలిగ్గా అనుసరించగలవు. అవేమిటో చెప్పనా చిన్నీ?!

చూడూ! మీ అత్తగారు ఏదైనా చెప్పారనుకో- వెంటనే 'కాదు', 'లేదు' అనే మాటలు నీ నోటిగుండా రానీకు. వీలైనంతవరకు ఆ పని చేసి- అంటే... నీ శరీరాన్ని కాస్త కష్టపెట్టుకుని ఆమెను తృప్తిపరచి, ఆమె నీకు అందించే ప్రేమలో తడిసి మానసికానందాన్ని పొందు. నేను కవిత్వం చెప్తున్నానని అనుకోకు.

ఒకవేళ మీ ఇంట్లో ఎవరైనా- అనారోగ్యంతో వచ్చిన అసహనంతో నిన్ను అనకూడని మాట అన్నా... దానికి నీ మనసు నొచ్చుకున్నా... వెంటనే దురుసుగా జవాబు చెప్పకు. నీ ఆవేశం చల్లారాక ఆలోచించు. వ్యక్తిగా మంచివాళ్ళైతే... ఆ కోపాన్ని మనసులో నుండి తుడిచెయ్! వాళ్ళ వయసునీ, వాళ్ళ బలహీనతల్నీ క్షమించు. అలా అని నిన్ను బానిసత్వం చేయమనడం లేదు. నువ్వు ఆడదానివని గుర్తుచేయడం లేదు. రేపు నీ తమ్ముడికైనా నేను ఇదే చెప్తాను. క్షమించేగుణం వున్న వ్యక్తి మహోన్నతుడు. అలాంటి క్షమాగుణం నా కూతురిలో వుండాలని నేను కోరుకోవడం తప్పా దీప్తీ?!

అందుకేనమ్మా! నువ్వూ సుఖపడు... నీవాళ్ళనూ సుఖపెట్టు. దానివల్ల నీకు పశ్చాత్తాపం, గిల్టీ ఫీలింగ్ లేని జీవితం లభిస్తుంది. ఆవేశాలు, ఆగ్రహాలు, పంతాలు, పట్టింపులు... ఇవన్నీ క్షణంలో మనల్ని చుట్టేసి, బలహీనులుగా మార్చి, నిగ్రహశూన్యుల్ని చేసి, మన వివేకాన్ని దోచేసి, మరుక్షణంలో మనలో అణగదొక్కబడిన రాక్షసుణ్ణి లేవదీసి- తర్వాత తీరిగ్గా మన తొందరపాటుకు మనమే పశ్చాత్తాపపడేలా చేసి సరదా చూస్తాయి. కేన్సర్‌లా మన మనశ్శాంతిని తొలిచేస్తాయి. క్షణం... ఒకే ఒక్క క్షణం... వాటిని మనం

నిగ్రహించుకుంటే- ఎదుటివ్యక్తికి మన మనసు లోతులో ఏముందో తెలీదు. ఆ తర్వాత మనవాళ్ళ మీద మనకు వున్న ప్రేమ వాళ్ళను క్షమిస్తుంది.

దీప్తీ! ఎదుటివ్యక్తి లోపాల్నీ, బలహీనతల్నీ మనం అర్థంచేసుకుని నిశ్శబ్దంగా వుంటే మన మనసు కూడా మనల్ని క్షమించేస్తుంది. 'నేను తప్పు చేయలేదు. పైగా, తప్పు చేసిన మనిషిని క్షమిస్తున్నాను' అనే తృప్తి ఎంత అసామాన్యమైంది?! ...ఆలోచించు! కానీ, అలా అని అన్యాయాన్నీ, అరాచకాన్నీ, క్రూరత్వాన్నీ క్షమించమని నేను అనడం లేదురా... అర్థంచేసుకోమ్మా దీప్తీ!

నేను నీకు ఈ ఉత్తరం వ్రాస్తూ... నువ్వు దీన్ని చదువుకుంటున్న దృశ్యాన్ని ఊహిస్తున్నాను. కాకపోతే- నీలోకి దూరి చూడలేకున్నాను. నువ్వు నా ఉత్తరం చదువుతూ... మనసు కష్టపెట్టుకుంటున్నావేమోనని నా మనసు శంకిస్తోంది. అయినా నేను నీకు చెప్పాలనుకున్నది ఇంకొంత వుంది. అది చెప్పేశాకే ఈ ఉత్తరం ముగిస్తాను.

'అమ్మ గుండె కఠినమైంది' అని అనుకుంటున్నావా? ఫర్వాలేదురా... ఎలా అయినా అనుకో! నేను అస్తమించే సూర్యుణ్ణి... నువ్వు ఇంకా విచ్చుకోని పుష్పానివి. నేను నీకు కొద్దికాలం మాత్రం మిగిలే ఆత్మీయురాలిని. కానీ, చిన్నీ... ఈ ఉత్తరం నీకు జీవితాంతపు నేస్తం కావాలి, అది నిన్ను ఒక మంచి పుస్తకంలా ప్రభావితం చేయాలి... అదే నా ఆశ!

ఇంకొకటి కూడా వినమ్మా దీప్తీ! నువ్వు నేను చెప్పేది విను. నా మాటల్లోని మంచి చెడ్డల్ని గురించి నీ మేధస్సుతో ఆలోచించు. నీ నిర్ణయం నువ్వు తీసుకో!

దీప్తీ! 'ఇల్లు చూసి ఇల్లాలిని చూడమ'న్నారు. ఈ ఇంట్లో నువ్వు పెరిగి పెద్దదానివయినప్పుడే ఇల్లు దిద్దుకోవాల్సిన బాధ్యత నీమీద పడింది. కానీ, నీ చదువులో నువ్వు- నీ మీద ప్రేమతో నేను- దాన్ని గుర్తించలేదు. ఇప్పుడైనా ఇల్లు దిద్దుకునే బాధ్యత నుండి మీ అత్తగారిని తప్పించి, అలసిపోయిన ఆమెకు విశ్రాంతి నివ్వు.

ఏదైనా పనిని నీకు అప్పజెప్పినప్పుడు- నువ్వు దానిని మర్చిపోవడం జరిగితే... ఒకటి, రెండు మార్లయితే అది క్షమార్హం. కానీ, అదే పొరపాటును నువ్వు పదేపదే చేస్తూ పోతే... ఆ పని తాలూకు ప్రాధాన్యతను, ఆ పనిని నీకు అప్పజెప్పిన వారి విలువను నువ్వు నిర్లక్ష్యం చేసినట్టు! అప్పుడు నువ్వు వాళ్ళ దగ్గర నుండి ప్రేమను, అభిమానాన్ని, నమ్మకాన్ని, కృతజ్ఞతను కోల్పోతావు.

నీ మాటకు ఎవ్వరూ ఎదురుచెప్పడం లేదని- వాళ్ళను మాటిమాటికి కోపగించుకోవడం, విసిగించడం చేయకు. ఎందుకంటే... వాళ్ళ నిగ్రహాన్ని తెగేదాకా లాగితే నష్టపోయేది నువ్వే!

ఎల్లవేళలా మనం మన కోరికలు తీర్చుకోవడంలో పొందే ఆనందం కంటే- ఎప్పుడైనా ఒకసారి మరొకరి కోరిక తీరిస్తే... వాళ్ళ కళ్ళల్లో కదలాడే కృతజ్ఞతా కెరటాల్లో మనకు దొరికే తృప్తి అనంతం... నిజం! దాన్ని ఒకసారి అనుభవించి చూడు... నిజమైన ఆనందం దక్కుతుంది నీకు. 'అమ్మ పాతకాలం సూక్తులు చెప్తోంది' అని అనుకుంటున్నావా దీప్తీ! కాలం ఏదైనా-

అప్పుడైనా, ఇప్పుడైనా... మనిషికి కావాల్సింది... మనశ్శాంతి. దాని తాలూకు సంతోషం నీకు ఎక్కడ ఆనందం దొరుకుతుందో నీకంటె నాకు బాగా తెలుసు. అందుకే నిన్ను నీ ముందు పరుస్తున్నాను. నేను చేస్తున్నదంతే!

దీప్తీ! ఎదుటివారిని మనం నొప్పించినప్పుడు- మన మనస్సాక్షి మనల్ని ఎదురు ప్రశ్నిస్తే... అప్పుడు మనం ఎవ్వరినీ బాధపెట్టలేం! సో... చిన్నీ! నీ మనస్సాక్షిని నువ్వు పదును పెట్టుకో! దానిమీదే నువ్వు ఆధారపడు.

మనం చేసే పొరపాట్లకు దేవుణ్ణి బాధ్యుణ్ణి చేయకు! అట్లా చేస్తే... నువ్వు నిరపరాధివని నీ మనస్సును మోసం చేసుకుంటూ అపరాధాలు చేస్తూ ఉంటావు. నా చిట్టితల్లి అలా కాకూడదని ఆశపడ్తున్నాను.

దీప్తీ! ఆఖరగా నిజం ఒప్పుకుంటున్నాను. నా భయాన్ని నీ ముందు పరుస్తున్నాను. 'ఈ దేశపు దురదృష్టపు ఆడపిల్లలకు అమెరికాలోలాగ విడాకులు తీసుకునే అవకాశం వుంటే బావుణ్ణు' అని ఒకప్పుడు అనుకున్న నేను- ఇప్పుడు కేవలం భేదాభిప్రాయాల వల్ల విడాకులు తీసుకుంటున్న జంటలను చూసి భయపడి... ఇదంతా చెప్పాను. నువ్వు చిన్నబుచ్చుకుని నన్ను క్షమించకపోయినా పర్వాలేదు. నీ జీవితం బావుంటే అంతే చాలు నాకు...

వుంటారా కన్నా...

– ప్రేమతో
మీ అమ్మ"

●

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక ... జూలై' 2004 సంచికలో ప్రచురితమైన కథ